సాక్షి
కుమురం భీం
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



ఐటీడీఏ అలసత్వం!
ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు సజావుగా నిర్వహించడంలేదు. దీంతో ఏజెన్సీలో జీవనం సాగిస్తున్న గిరిజనులు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. 8లో▸



ఘనంగా వినాయక నిమజ్జనం
జిల్లాలోని పలు చోట్ల గణేశ్ నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. శోభాయాత్రగా వెళ్లి జలాశయాల్లో విగ్రహాలు నిమజ్జనం చేశారు. 9లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 32.0 /24.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

11న కాంట్రాక్ట్ వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూ

ఆసిఫాబాద్: సిర్‌పూర్‌టౌన్, బెజ్జూర్, కాగజ్‌నగర్, తిర్యాణి, వాంకిడి, జైనూర్ సామాజిక ఆస్పత్రుల్లో కాస్‌స్పెషలిస్ట్ గైనకాలజిస్టు, పిడియాట్రిక్, జనరల్ మెడిసిన్, ఎంబీబీఎస్ జనరల్ డ్యూటీ డాక్టర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు టీవీవీపీ జిల్లా ప్రధానాస్పత్రి సూపరింటెండెంట్ అవినాశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 11న ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. స్పెషలిస్ట్ వైద్యులకు రూ.లక్ష, జనరల్ వైద్యులకు రూ.52,351 వేతనం చెల్లించనున్నట్లు వివరించారు.

గణేశ్ నిమజ్జనోత్సవంలో ఎస్పీ



పెద్దవాగులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న ఎస్పీ దంపతులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగులో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ దంపతులు తమ నివాసంలో నెలకొల్పిన మట్టి గణపతిని శనివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పెద్దవాగు వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా ముగించినందుకు జిల్లా ప్రజలు, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ టీచర్లకు 'ప్రశంస'



ప్రశంసాపత్రం అందుకుంటున్న సవీందర్

లింగాపూర్: మండలంలోని పిక్లాతండా గ్రామంలోగల గిరిజన సంక్షేమ పాఠశాలలో సీఆర్టీగా విధులు నిర్వహిస్తున్న జాదవ్ సవీందర్, కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు కనక బుచ్చిరాం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి వీరికి ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి



రహదారిని పరిశీలిస్తున్న విజయ్, నాయకులు

కెరమెరి: మండలంలోని మడావిగూడ, చిన్నుగూడ గ్రామాల సమస్యలు పరిష్కరించాలని తెడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కోరారు. శనివారం ఆయా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలకు రోడ్డు సౌకర్యం, కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీసం అంబులెన్స్ కూడా వెళ్లే పరిస్థితి లేదని తెలిపారు. గర్భిణులు, ప్రజలకు అనారోగ్య సమస్యలెదురైతే నరకయాతన అనుభవించక తప్పదని పేర్కొన్నారు. గతంలో పలుసార్లు అధికారులకు వినతిపత్రాలిచ్చినా ప్రయోజనం లేకపోయిందని ఆరోపించారు. వర్షం వస్తే మట్టి రోడ్లపై మోకాళ్ల లోతు బురద ఉంటుందని, అధికారులు వెంటనే స్పందించి రహదారులు నిర్మించాలని, కనీస వసతులు కల్పించాలని కోరారు.

ఎస్టీయూ జిల్లా కార్యవర్గం



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఎస్టీయూ జిల్లా కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో రాష్ట్ర కార్యదర్శి సదానందంగౌడ్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుర్క మానిక్‌రావు, ప్రధాన కార్యదర్శిగా తుకారాం, గౌరవాధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, అన్నపూర్ణ, అదనపు ప్రధాన కార్యదర్శిగా బాదిరావు, కార్యదర్శులుగా అహ్మద్, శారద, స్రవంతి, ఆర్థిక కార్యదర్శులుగా నగేశ్, లక్ష్మణ్ ఎన్నికయ్యారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



కెరమెరిలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం



ఝరి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో సాగవుతున్న ఆకుకూరలు, కూరగాయలు

అంగన్‌వాడీల్లో పోషణ్ వాటిక

- జిల్లాలో 100 బడుల్లో అమలు
- ఇక పంట, వంట కేంద్రాల్లోనే..
- ఒక్కో సెంటర్‌కు రూ.10 వేలు
- స్థలం కొరతే అసలు సమస్య

జిల్లా సమాచారం	అంగన్‌వాడీ కేంద్రాలు	పోషణ్‌వాటికకు ఎంపికైనవి	ఒక్కో కేంద్రానికి నిధులు
	1,006	100	రూ.10వేలు

కెరమెరి(ఆసిఫాబాద్): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత నాణ్యతతో పోషకాహారం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలోని 1,006 అంగన్‌వాడీ కేంద్రాల్లో 100 సెంటర్లను ఎంపిక చేసి పోషణ్ వాటిక పథకం అమలు చేయాలని నిర్ణయించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీ స్థలాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించేందుకు సన్నద్ధమవుతోంది. ఎంపిక చేసిన ఒక్కో కేంద్రానికి రూ.10 వేల చొప్పున నిర్వహణ నిధులు అందించనుంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా చర్యలు చేపడుతోంది. కాగా, 2023 నుంచి జిల్లాలోని కొన్ని కేంద్రాల్లో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తుండడం గమనార్హం.

జిల్లాకు చేరిన విత్తన ప్యాకెట్లు

గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఆకుకూరలు, కూరగాయలను కాంట్రాక్టర్లు సరఫరా చేసేవారు. వీటి సరఫరా బాధ్యతలు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యత లేని కూరగాయలు, ఆకుకూరలు అంటగట్టేవారు. దీంతో కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యం నెరవేరలేదు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లోని ఖాళీ ప్రదేశాల్లో స్వయంగా కూరగాయలు, ఆకుకూరలు సేంద్రియ విధానంలో పండించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఐదు కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా..

ఇప్పటికే జిల్లాలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషణ్ వాటిక' పథకాన్ని ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. ఇందుకు అవసరమైన రూ.500 ఖరీదు చేసే విత్తన ప్యాకెట్లు జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి ఇప్పటికే చేరాయి. ఏయే కేంద్రాలను మొదటి విడతకు ఎంపిక చేసి విత్తన ప్యాకెట్లు ఇవ్వాలనే విషయమై సంబంధిత అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. విత్తన ప్యాకెట్లలో పాలకూర, మెంతి, ఉసిరి, వంకాయ, టమాట, బెండ, పొట్ల గింజలున్నాయి. అలాగే, ఉసిరి, కలబంద, మునగ మొక్కలు కూడా ఆవరణల్లో పెంచనున్నారు. బలవర్ధకమైన ఆహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించడమే లక్ష్యంగా దీని అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లే కొనసాగించాలా.. లేక ఉద్యానవనశాఖ అధికారులా.. లేదా ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు నిర్వహించాలా.. అనే మీమాంసలో అధికారులున్నారు.

పలు కేంద్రాల్లో స్థలం కొరత

జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ వాటిక పథకం అమలు ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు స్థలం కొరతే కారణం. ఈ కారణంగా ఎంపికైన కేంద్రాల టీచర్లు ఈ పథకం అమలుకు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. అలాగే, స్థలమున్న పలు అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ ప్రహరీలు లేక కూరగాయలు, ఆకుకూరల సాగుకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. పశువులు, కోతులు బెడదతో సాగు చేసే పరిస్థితి కనిపించడంలేదు.

ముందుగా ఐదు కేంద్రాల్లో..



పోషణ్ వాటిక పథకానికి జిల్లాలోని 100 అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపికయ్యాయి. ఇందులో ఐదింటిలో ప్రయోగాత్మకంగా ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తాం. ఇప్పటికే జిల్లాకు ఐదు విత్తన కిట్లు చేరాయి. పథకం అమలు బాధ్యత ఉద్యానవన అధికారులు, ఎంపీడీవో, అంగన్‌వాడీ టీచర్లలో ఎవరికి అప్పగించాలనే నిర్ణయం ఇంకా తీసుకోలేదు. కాగా, స్థలం కొరత కారణంగా కొందరు టీచర్లు పథకాన్ని అమలు చేసేందుకు ముందుకు రావడంలేదు.
– ఆడెపు భాస్కర్, ఐసీడీఎస్ పీడీ

సొంతింటి కల నెరవేర్చుకోవాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు
- 'ఇందిరమ్మ' ప్రొసీడింగ్స్ పంపిణీ



దహెగాంలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: లబ్ధిదారులు ఇందిరమ్మ పథకాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, అదనంగా మరో 500 ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో పైలట్ గ్రామమైన దిగిడకు 12 ఇళ్లు మంజూరు కాగా, నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. మండలానికి 244 ఇళ్లు మంజూరు కాగా, 207 నిర్మాణాలు ఇదివరకే ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మరో 37 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించామని పేర్కొన్నారు. మండలానికి మరో 150 ఇళ్లు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తుందని, సర్వే పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. మండలంలోని పెసరికుంట, మొట్లగూడ పంచాయతీలకు పక్కా భవన నిర్మాణాల కోసం రూ.20 లక్షల చొప్పున ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు తెలిపారు. కల్వాడ నుంచి ఒడ్డుగూడ వరకు డబుల్ రోడ్డు మంజూరైందని, త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఒడ్డుగూడ నుంచి కర్జి వరకు రోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కోత్మీర్ నుంచి దహెగాం వరకు నిలిచిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పెంచికల్‌పేట్ వెళ్లే దారిలోని చిన్నవంతెన వద్ద హైలెవల్ వంతెన నిర్మాణం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్ తహసీల్దార్ మునవార్ షరీఫ్, ఎంపీడీవో రాజేందర్, బీజేపీ మండలాధ్యక్షుడు లగ్గాము దామోదర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న యువరాజు

వాంకిడి: మహిళలు, బాలికలు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజు సూచించారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 10రోజుల పాటు జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. అణిచివేతలకు గురవుతున్న ఆయా వర్గాల మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని వాటిని అధిగమించాలని సూచించారు. వరకట్న వేధింపుల నిషేధ చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, పోక్సో, మహిళల అక్రమ రవాణా, లింగ సమానత్వం, ప్రాథమిక హక్కులతో పాటు నూతనంగా అమలులోకి వచ్చిన వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. 1098, 1811, 112, 14567, 1930, 100 హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దేవేందర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య పాల్గొన్నారు.

మరింత చేరువలో సాంకేతిక పరిజ్ఞానం



తిర్యాణి: ఆస్పత్రిలోని జనరల్ వార్డులో రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

తిర్యాణి: ఏఐ ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం మరింత చేరువైందని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గంభీరావుపేటలోగల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనంలో నాణ్యత, తరగతుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి ఓపీ వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, క్రమం తప్పకుండా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి, మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించి నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

వసతుల కల్పనకు చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని తిర్యాణి బ్లాక్‌లో అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ దిపక్ తివారీ తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. తాగునీరు, మూత్రశాలలు, ఫ్యాన్లు, ఫర్నిచర్, మరుగుదొడ్లు తదితర అంశాలను ఇంజినీరింగ్, సంబంధిత అధికారులు పర్యవేక్షించి అవసరమున్న చోట అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి తహసీల్దార్‌తో సమన్వయం చేసుకుని స్థలాలు గుర్తించాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణ, డీఐఈవో కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత ప్రమాణాలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న భార్గవి

ఆసిఫాబాద్‌అర్బన్: దుకాణాదారులు, హోటల్ నిర్వాహకులు ఆహార భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడాలని భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ సర్టిఫైడ్ శిక్షకురాలు భార్గవి కంచర్ల సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం గార్డెన్స్‌లో దుకాణాదారులు, హోటళ్ల నిర్వాహకులకు ఎంసీఈడీ (మహారాష్ట్ర సెంటర్ ఫర్ ఆంత్రపెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన ఆహార రంగులు, ఉప్పు వినియోగించవద్దని, మంచినూనెను మూడుసార్ల కంటే ఎక్కువగా మరిగించి వాడొవద్దని సూచించారు. హోటల్ నిర్వాహకులు, వంటి సిబ్బంది ఆర్నెళ్లకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టం–2006ను తెలుసుకోవాలని, ఆరోగ్యకర నూనెలు, పదార్థాలు వినియోగిస్తే మార్కెట్‌లో బిజినెస్ పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ అచ్యుత్‌కుమార్, సభ్యులు శ్రీనివాస్, విజయ్, మహేశ్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

'పెట్టుబడిదారులకే కేంద్రం వత్తాసు'



మాట్లాడుతున్న ముంజం శ్రీనివాస్

కెరమెరి: పెట్టుబడిదారులకే కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాలకులు మారినా కార్మికులు, ఉద్యోగుల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. ధనవంతుల కోసం ప్రభుత్వాలు చేసే నిర్ణయాల మూలంగా కార్మికవర్గం ఇబ్బందుల పాలవుతోందని పేర్కొన్నారు. వారికి కనీస ఉద్యోగ భద్రత, వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఐసీడీఎస్, ఎండీఎం తదితర రంగాలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. సమావేశంలో నాయకుడు కూటికల ఆనంద్‌రావు అంగనవాడీలు, ఆశ కార్యకర్తలు, ఐకేపీ వీవోఏలు ఉన్నారు.

తీరనున్న పేదోడి సొంతింటి కల

- జిల్లాకు 6,736 ఇందిరమ్మ ఇండ్లు
- గత నెల 925 నిర్మాణాలు షురూ..
- శరవేగంగా కొనసాగుతున్న పనులు

జిల్లాలో 'ఇందిరమ్మ' వివరాలు

మంజూరైన ఇళ్లు	6,736
మార్కింగ్ చేసినవి	4,918
బేస్మెంట్ దశలో..	2,420
స్లాబ్ దశలో..	30
గోడల దశలో..	116

ఆసిఫాబాద్‌అర్బన్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభించింది. ఇచ్చిన నమూనా ప్రకారం ఇంటిని లబ్ధిదారులే నిర్మించుకోవాలని నిర్ణయించింది. ఇందుకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ప్రభుత్వ సాయం అందించనున్నట్లు ప్రకటించింది. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసింది. ఈలెక్కన జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు 3,500 చొప్పున 7వేల ఇళ్లు మంజూరు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 6,736 మాత్రమే మంజూరయ్యాయి. లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందజేసింది. జిల్లాలో 4,918 ఇళ్ల నిర్మాణాలకు అధికారులు మార్కింగ్ చేశారు. గత నెలలో 925 ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. మొదట మంచి ముహూర్తాలు లేకపోవడం, నిబంధనలు కఠినంగా ఉండడంతో లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో ఒక్కొక్కరుగా ముందుకు వచ్చి నిర్మాణాలు ప్రారంభించారు. ముందుగా పనులు కొంత నెమ్మదించినా వెంటవెంట బిల్లులు వస్తుండడంతో లబ్ధిదారులు పనుల్లో వేగం పెంచారు. జిల్లాలో ఇప్పటివరకు ప్రభుత్వం లబ్ధిదారులకు సుమారు రూ.24.16 కోట్ల బిల్లులు వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసింది.



సిర్పూర్ (టీ)లో స్లాబ్ దశలో నిర్మాణం

నిబంధనల ప్రకారమే నిర్మించాలి



జిల్లాలోని అర్హులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలి. నిర్మాణ దశల ప్రకారం ప్రభుత్వం వెంటవెంటనే బిల్లులు చెల్లిస్తోంది.
– వేణుగోపాల్, హౌసింగ్ పీడీ

ప్రత్యేక రైలు వేస్తారా..!

గత ఏడాది సంక్రాంతి పండుగ వేళ సికింద్రాబాద్ నుంచి మంచిర్యాలకు వచ్చిన ఇంటర్‌సిటీ రైలులో కనిపించిన దృశ్యమిది. ప్రయాణికులు కిక్కిరిసిపోయి ఉండడంతో కాలు తీసి కాలు పెట్టే అవకాశం లేకపోయింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు గంటల తరబడి నిల్చుని తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ప్రస్తుతం బతుకమ్మ, దసరా సెలవుల్లోనూ పండుగ రద్దీ అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య ప్రత్యేక రైలు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



- బతుకమ్మ, దసరా పండుగలకు రద్దీగా రైళ్లు
- కిక్కిరిసిన బోగీల్లోనే అవస్థలతో ప్రయాణం
- కాగజ్‌నగర్–సికింద్రాబాద్‌కు మరో రైలుకు డిమాండ్లు
- స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు దృష్టి సారించాలని వినతులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉత్తర తెలంగాణ ప్రాంత రైలు మార్గాల్లో పండుగలు, పర్వదినాల్లో రెట్టింపు ప్రయాణికులతో రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. తెలంగాణలో అతిపెద్ద పండుగ బతుకమ్మ, దసరాకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. విద్యాసంస్థలకు సెలవులతో విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామాలు, పట్టణాలకు వెళ్తుంటారు. రద్దీ పెరిగి సికింద్రాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు ఈ ప్రాంత ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఆంధ్రా వైపేనా..

ప్రత్యేక రైళ్లు వేస్తున్నప్పటికీ ఆంధ్రాలోని కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. సంక్రాంతితోపాటు ఇతర పండుగ సమయాల్లో ఆంధ్రా వైపు స్పెషల్ ట్రైన్లు నడుస్తున్నాయి. ఉత్తర తెలంగాణ ప్రయాణికులకు కొత్త రైలు ఊసే లేకుండా పోతోంది. మరోవైపు బస్సుల్లో పండుగ స్పెషల్ పేరిట అదనపు చార్జీ వసూలు చేస్తుంటారు. మహిళలకు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ ఉచిత ప్రయాణంతో బస్సులు రద్దీగా ఉంటున్నాయి. తక్కువచార్జితో ఎక్కువ దూరం ప్రయాణించే సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు రోజూ స్పెషల్‌ట్రైన్ నడపాల్సి ఉంది.


రద్దీగా సికింద్రాబాద్ రైళ్లు

ప్రస్తుతం హైదరాబాద్‌కు ఉదయం వెళ్తున్న భాగ్యనగర్, మధ్యాహ్నం బీదర్ ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ఇక సికింద్రాబాద్ నుంచి ఉదయం 9:25గంటలకు దానాపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తర్వాత భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ వరకు మధ్యలో కాగజ్‌నగర్ వైపు వెళ్లడానికి ఒక్క రైలు కూడా అందుబాటులో లేదు. ఈ నెల 21నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించనుండగా వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.

కొత్త రైలు నడిపితే మేలు

మూడో లైన్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ప్రతీరోజు ఉదయం సికింద్రాబాద్ జంక్షన్ నుంచి 10.35గంటలకు బయలుదేరి, కాజీపేటకు 12.40గంటల వరకు జమ్మికుంట, పెద్దపల్లి జంక్షన్ మీదుగా రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్ 3.45వరకు చేరుకునేలా ఓ రైలు నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సాయంత్రం 5గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరి బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి జంక్షన్, జమ్మికుంట, కాజీపేట మీదుగా సికింద్రాబాద్ వరకు రాత్రి 10గంటలకు చేరుకోవాలి. ఈ రైలుకు పలు స్టేషన్లలో హాల్టింగ్ కల్పిస్తే వేలాది గ్రామాల ప్రజలకు ఉపయోగపడనుంది. మొదట ప్రయోగాత్మకంగా రైలును ఆరంభించి, రద్దీకి అనుగుణంగా రెగ్యులర్‌గా నడిపితే వేలాదిమందికి ఉపయోగపడనుంది.

స్పెషల్ ట్రైన్ నడపాలి



పండుగ సమయాల్లో రైళ్లలో విపరీత రద్దీ ఉంటోంది. మంచిర్యాల, సికింద్రాబాద్ మధ్య సెలవుల్లో ప్రయాణాలు అధికంగా ఉంటాయి. దీంతో రైళ్లలో వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. పండుగ పూట ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి ప్రత్యేక రైళ్లు నడపాలి.
– పొడల సుమన్, రైలు ప్రయాణికుడు, మందమర్రి

క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్‌లో పరుగుల వరద


హిమతేజ

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రికెటర్ హిమతేజ ఆల్ ఇండియా బుచ్చిబాబు టోర్నమెంట్లో సత్తా చాటాడు. చెన్నై వేదికగా హైదరాబాద్–తమిళనాడు మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో శనివారం 97 పరుగులు సాధించాడు. మొత్తంగా హైదరాబాద్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 294 పరుగుల భారీ స్కోరు సాధించింది. టోర్నమెంట్లో 97 పరుగులు చేయడం పట్ల కోచ్ జయేంద్ర పటాస్కర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

గోండిభాషలో మహాభారతం అభినందనీయం


కైలాస్ దంపతులను సన్మానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: గోండి భాషలో మహాభారతాన్ని రచించడం అభినందనీయమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివాసీ ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ ఏఐ బోధనలు చేస్తూ ఇటీవల రాష్ట్రపతితో పాటు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. విషయం తెలుసుకున్న రామన్న కైలాస్ దంపతులను సత్కరించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ముందుకు సాగుతూ జాతీయ స్థాయిలో అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పవన్ నాయక్, రాజన్న, కలీం, తదితరులు ఉన్నారు.

స్వీట్‌హౌస్ నిర్వాహకుడికి జరిమానా


స్వీట్ హౌస్ నిర్వాహకుడికి రశీదు అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్‌చౌక్‌లో గల ఢిల్లీ మిఠాయివాలా స్వీట్ హౌస్ నిర్వాహకుడికి మున్సిపల్ అధికారులు శనివారం జరిమానా విధించారు. తాను కొనుగోలు చేసిన స్వీట్‌లో పురుగులు వచ్చాయంటూ ఓ వినియోగదారుడు కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బైరి శంకర్ సిబ్బందితో కలిసి ఆ స్వీట్‌హౌస్‌ను పరిశీలించారు. సదరు నిర్వాహకుడికి రూ.4వేల జరిమానా విధించారు. ఆయన వెంట ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అవికిరణ్, సిబ్బంది నారాయణరెడ్డి ఉన్నారు.

ఐటీడీఏ అలసత్వం!

ఏజెన్సీలో జీవనం సాగిస్తున్న గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం, వివిధ పథకాల అమలు, ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు నిర్వహించే ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలు జరగడం లేదు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి అభివృద్ధి పనులపై సమీక్షించడం, కొత్త పనులకు తీర్మానం చేయడం వంటి వాటిపై చర్చ జరగకపోవడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. – ఉట్నూర్‌రూరల్

- గిరిజన అభివృద్ధికి ఆటంకం
- ఆరేళ్లుగా సమావేశం కాని పాలకవర్గం
- మీటింగ్‌పై పట్టింపులేని అధికారులు
- పరిష్కారానికి నోచుకోని 'గిరి' సమస్యలు


కన్నాపూర్‌లో నీటికోసం బావి వద్ద గుమిగూడిన గ్రామస్తులు (ఫైల్)

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2019లో అప్పటి కలెక్టర్ దివ్యదేవరాజన్, ఐటీడీఏ పీవో కృష్ణ ఆదిత్య ఆధ్వర్యంలో ఐటీడీఏ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. కానీ అభివృద్ధిని గురించి పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందించి ఐటీడీఏ సమావేశం నిర్వహించి గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని కోరుతున్నారు.

తీర్మానాలే అత్యంత కీలకం..

గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లో 1975లో ఐటీడీఏను ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 44 ఏజెన్సీ మండలాల్లోని 250 గ్రామ పంచాయతీల్లో విస్తరించి ఉంది. ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, సిర్పూర్ (యు), కెరమెరి, వాంకిడి, తిర్యాని గిరిజన మండలాలు ఉన్నాయి. నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఐటీడీఏ జనరల్ బాడీ మీటింగ్‌లో గిరిజనుల సమస్యలపై చర్చించి వారి అభివృద్ధికి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుంది. గిరిజనులతో పాటు గిరిజనేతరుల సమస్యల పరిష్కారానికి పాలకవర్గం చేసే తీర్మానాలు కీలకం. ఈ తీర్మానాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని గిరిజనుల సంక్షేమం కోసం చర్యలు తీసుకునే ఆస్కారం ఉంటుంది. కానీ ఆరు సంవత్సరాలుగా పాలక మండలి సమావేశాలు లేకపోవడంతో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.


వాగుదాటి నర్సాపూర్(జే) గ్రామానికి వెళ్తున్న ఆదివాసీలు (ఫైల్)

వెంటాడుతున్న సమస్యలు

ఏజెన్సీ గ్రామాల్లో రోడ్లు, వంతెనలు లేక అనేక గ్రామాల గిరిజనులు బాహ్య ప్రపంచానికి దూరంగానే ఉంటున్నారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం ద్వారా రహదారులు అభివృద్ధి చేయాల్సినప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఎమర్జెన్సీ సమయాల్లో వైద్యం కోసం వెళ్లే వారు వంతెనలు, వాగులు దాటలేక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. గర్భిణులకు ప్రసవ వేదన తప్పడం లేదు. ఏటా సీజనల్ వ్యాధులు, రక్తహీనత సమస్య వెంటాడుతూనే ఉంది. దీనికి తోడు సికిల్‌సెల్ సమస్య కూడా ఉంది. ముఖ్యంగా పోడు పట్టాల సమస్యతో ఎంతోమంది ఆదివాసీలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఐటీడీఏ పాలకవర్గం ఏర్పాటుతో పాటు సమావేశం నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

సమావేశాలు నిర్వహించాలి



ఆరేళ్లుగా ఐటీడీఏ సమావేశాలు నిర్వహించకుండా అధికారులు, పాలకులు జాప్యం చేశారు. ఏజెన్సీ పరిధిలోని అనేక గిరిజన గ్రామాలకు కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన పట్టించుకోని ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలు నిర్వహించాలి.

– కోట్నాక్ విజయ్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు

సమస్యలు వెలుగులోకి



ఉమ్మడి జిల్లాలోని అనేక మారుమూల గ్రామాల్లో నేటికీ రోడ్డు, విద్యుత్, వంతెనలు, తదితర సదుపాయాలు లేక ఆదివాసీలు అష్టకష్టాలు పడుతున్నారు. ఐటీడీఏ సమావేశం నిర్వహణతో ఇక్కడి ప్రాంత ప్రజల సమస్యలు వెలుగులోకి వస్తాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయమై దృష్టి సారించాలి.

– పుర్క బాపురావు, తుడుందెబ్బ జిల్లా కోఆర్డినేటర్

చర్యలు తీసుకుంటాం



ఐటీడీఏకు గవర్నింగ్ బాడీ లేకపోవడంతో సమావేశాలు నిర్వహించడం లేదు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇది వరకే అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అధ్యక్షతన జిల్లాస్థాయిలో సమావేశం నిర్వహించాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఐటీడీఏ గవర్నింగ్ బాడీ మీటింగ్ నిర్వహణకు చర్యలు తీసుకుంటాం.

– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో, ఉట్నూర్

తాను మరణించినా నలుగురికి ప్రాణదానం


భీమ రమేశ్ (ఫైల్)

లక్ష్మణచాంద: తాను మృతి చెందినా తన అవయవాలను మరో నలుగురికి ఇచ్చి ప్రాణదానం చేశాడు. మండల కేంద్రానికి చెందిన భీమ రమేశ్ (28) మూడేళ్లక్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. గత నెల 8న పని ముగించుకొని ట్రక్కులో రూమ్‌కు వచ్చే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఎంఎంఎస్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో 25న మృతి చెందాడు. మృతుడు గతంలో తన అవయవాలు దానం చేస్తానని రాసి ఇచ్చాడు. దీంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో నాలుగు అవయవాలను తీసుకున్నట్లు అతని మిత్రులు తెలిపారు. 13 రోజుల తరువాత శనివారం మృతదేహం స్వగ్రామం చేరుకుంది. మృతునికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాగుదాటి.. కార్యక్రమం నిర్వహించి


వాగు దాటుతున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి వాగులో శనివారం నడుములోతు వరకు నీరు ప్రవహిస్తున్నప్పటికీ ఎంఈవో ఆడే ప్రకాశ్ వాగుదాటి కార్యక్రమం నిర్వహించారు. వాగుకు అవతల ఉన్న కరంజివాడ, శంకర్‌గూడ గ్రామాల్లో గిరిజనులకు ఆదికర్మ యోగి కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా దారి మధ్యలో వాగు ఉన్నప్పటికీ అతికష్టం మీద దాటివెళ్లారు. కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామాలకు కావాల్సిన సదుపాయాల గురించి ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పలు సూచనలు చేశారు.

ఇచ్చోడ తహసీల్దార్, ఆర్ఐ సస్పెన్షన్

- ఈ నెల 3న కలెక్టర్ ఉత్తర్వులు జారీ

ఇచ్చోడ: ఇచ్చోడ తహసీల్దార్ సత్యనారాయణరావు, ఆర్ఐ హుస్సేన్‌ను సస్పెండ్ చేస్తూ ఈనెల 3న కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని అడేగామ(బి) మాజీ సర్పంచ్ కదం వనిత, ఆమె భర్త కదం సుభాష్ ఓటరు పోలింగ్ బూత్‌ను వారి ప్రమేయం లేకుండా అడేగామ బి 140 నుంచి మండల కేంద్రంలోని 137వ బూత్‌కు వారి ప్రమేయం లేకుండా మార్చిన ఘటనలో ఇద్దరినీ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలతో పోలింగ్ బూత్ మార్పు చేసిన విషయం తెలుసుకున్న కదం సుభాష్ కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరావు ఆగస్టు 25న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు పోలింగ్ బూత్ మార్పులో ప్రమేయం ఉన్న ముగ్గురు వ్యక్తులతో పాటుగా ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ హుస్సేన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో తహసీల్దార్ ప్రమేయం కూడా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఎఫ్ఐఆర్‌లో ఏ6గా సత్యనారాయణరావు పేరును నమోదు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జిల్లా అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గతనెల 28 నుంచి విధులకు గైర్హాజర్ అవుతున్నారు. 30న ఆదిలాబాద్ ఆర్డీవో ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయంలో రహస్యంగా విచారణ చేపట్టి, నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ కేసులో ఏ6గా ఉన్న తహసీల్దార్‌ను పోలీసులు అరెస్ట్ చేయకుండా జాప్యం చేయడంపై రెవెన్యూశాఖలో విమర్శలు వినిపిస్తున్నాయి.

తొలగించిన జేఎంఈటీలకు తిరిగి ఉద్యోగాలు

శ్రీరాంపూర్: సింగరేణిలో వివిధ కారణాలతో టర్మినేట్(తొలగించిన) అయిన 43 మంది ట్రెయినీ జేఎంఈటీలను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోనున్నట్లు కంపెనీ సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఆదేశాలు జారీ చేశారు. గతంలో వీరంతా విధులకు సరిగ్గా హాజరు కాకపోవడంతో తొలగించామన్నారు. ఇటీవల గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, యజమాన్యం, డిప్యూటీ సీఎల్సీకి మధ్య జరిగిన త్రైపాక్షిక స్ట్రక్చరల్ సమావేశంలో జరిగిన ఒప్పందం మేరకు విధుల్లోకి తీసుకుంటున్నామన్నారు. వీరంతా కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్‌నెస్, ఓవర్‌మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్ ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇక నుంచి క్రమ శిక్షణతో ఉద్యోగాలు చేయాలని సూచించారు.

ముగ్గురు వాహన దొంగల రిమాండ్

భైంసాటౌన్: వాహనాలు చోరీ చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ జి.గోపినాథ్ తెలిపారు. పట్టణంలోని ఐబీ వద్ద ఎస్సై నవనీత్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టగా బైక్‌పై వచ్చిన ముగ్గురు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజామాబాద్‌కు చెందిన అఫ్జల్‌ఖాన్, భైంసా పట్టణంలోని ఆటోనగర్‌కు చెందిన మహ్మద్ అఫ్సర్, డ్రైవర్ కాలనీకి చెందిన షేక్ తాహీర్‌గా గుర్తించారు. మరో నిందితుడు అన్సర్‌తో కలిసి గతంలో హైదరాబాద్, కామారెడ్డి, భిక్కనూర్, నిర్మల్ ప్రాంతాల్లోనూ తరచూ వాహన చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. ఒక షెడ్డులో భద్రపరిచి వాటి రంగులు మార్చి మహారాష్ట్రలో ఒకేసారి విక్రయించేవారని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి మూడు ఆటోలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, అన్సర్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై నవనీత్ రెడ్డి, సుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- బైక్ అదుపుతప్పి యువకుడు దుర్మరణం

జన్నారం: అతివేగం ఆ యువకుడి ప్రాణాలను బలిగొంది. అతివేగంగా వచ్చిన బైక్ అదుపుతప్పి కాలువలో పడిపోయి యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల మేరకు జగిత్యాల జిల్లా బీర్‌పూర్ గ్రామానికి చెందిన పూదూరి నరేశ్, (20), శుక్రవారం రాత్రి వరుసకు సోదరుడైన పూదూరి విష్ణువర్ధన్‌తో కలిసి జన్నారం మండలంలోని బాదంపల్లిలో ఉంటున్న తన అక్క ఇంటికి బైక్‌పై బయలుదేరారు. ధర్మారం, బాదంపల్లి గ్రామాల మధ్యలో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. ఘటనలో నరేశ్‌కు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న విష్ణువర్ధన్‌కు తీవ్ర గాయాలు కావడంతో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి గంగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గూడ్స్ రైలింజన్ అద్దాలు ధ్వంసం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో బొగ్గు రవాణా చేసే గూడ్స్ రైలు ఇంజన్ అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఆకతాయిలు ఇంజన్ అద్దాలతో పాటు లోపలి పరికరాలను కూడా ధంసం చేసినట్లు సీహెచ్‌పీ అధికారులు గుర్తించి ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ, ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్ ఘటన స్థలికి చేరుకుని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు

కుంటాల: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని అంబకంటికి చెందిన ఒకరు 100 నంబర్‌కు పదే పదే కాల్‌చేసి విధులకు ఆటంకం కలిగించినట్లు ఆయన పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన కోరారు.

డీజే యజమాని, ఆపరేటర్లపై..

తలమడుగు: మండలంలోని ఖోడద్, సుంకిడి గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసిన నిర్వాహకులపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు రూరల్ సీఐ కే.ఫణిదర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి అధికశబ్దం వచ్చే డీజేలు తీసుకువచ్చి, లేజర్ లైట్లను ఏర్పాటు చేసినందుకుగానూ మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్‌కు చెందిన డీజే యజమాని చంద్రగుప్త పాటిల్, ఆపరేటర్లు కుద్మెత సోనేరావు, కార్తీక్ వాంకిడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తలమడుగు ఎస్సై డి.రాధిక, సిబ్బంది రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక శోభాయాత్రలో ఇద్దరికి గాయాలు

నర్సాపూర్(జి): గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో విషాదం చోటు చోటు చేసుకుంది. గణపతి విగ్రహాన్ని తరలిస్తుండగా భారీ ఫ్రేమ్ అదుపు తప్పి పడడంతో నర్సాపూర్ (జి) గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. సట్ల ముత్యంకు కాలు విరగగా, సట్ల కళ్యాణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ముత్యంను కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'అమెరికా పత్తితో మన రైతులకు ఉరి'

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బండారు రవికుమార్


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కైలాస్‌నగర్: ఆసియాలోనే ఆదిలాబాద్ పత్తికి మంచి డిమాండ్ ఉందని, అమెరికా పత్తికి అనుమతినిచ్చేలా సుంకాన్ని ఎత్తివేయడం రైతుల పాలిట ఉరిగా మారనుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ ఆరోపించారు. కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల పాత జాతీయరహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా నుంచి జీరో టారీఫ్‌తో పత్తి దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర నిర్ణయంతో దేశంలోని రైతాంగం ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వస్తుందన్నారు. భవిష్యత్‌లో రైతులు పత్తిని గిట్టుబాటు ధరలకు అమ్ముకోలేక అప్పుల పాలై పంట సాగునే మానేసే దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విధానాన్ని ప్రజలందరూ, రైతులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, నాయకులు లంక రాఘవులు, బండి దత్రాత్రి, పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

ఉట్నూర్‌రూరల్: అక్రమంగా వలస వచ్చిన లంబాడా, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక్ విజయ్, రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్, జిల్లా మేడి మెస్రం దుర్గు, రాష్ట్ర నాయకులు పుర్కా బాపురావ్, కేంద్ర, రగల్ జెండా అధ్యక్షుడు నాగోరావ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మత్తడిగూడలో గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్టీ జాబితాలో వచ్చిన కులాలపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారి చేసిన విషయం గుర్తు చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతి పత్రాలు, డిసెంబర్ 9న రాజ్ భవన్ ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తీర్మానించినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆదివాసీలు ఏకమై పోరాడాలన్నారు. నాయకులు రాంబాబు, రామారావు, బాలరాజు, వెంకటేశ్వర్, శేఖర్, దాదేరావు, సుదర్శన్, రాజన్న, వినాయక్, సంతోశ్, పటేళ్లు, రాయి సెంటర్ మేడిలు, పెద్దలు, మేదావులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులపై దాడి


వివరాలు సేకరిస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోస్టు మెట్రిక్ హాస్టల్ విద్యార్థులపై కొంత మంది దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కళాశాల ఆవరణలో శుక్రవారం వినాయక నిమజ్జనంలో విద్యార్థులు నృత్యం చేస్తుండగా ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. రాత్రి బయటినుంచి వచ్చిన ఐదుగురు వ్యక్తులు ముగ్గురు విద్యార్థులపై దాడి చేశారు. హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ శ్రీనివాస్, వాచ్‌మెన్ క్రాంతికుమార్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రావడంతో సదరు వ్యక్తులు పారిపోయారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, ఏబీసీడబ్ల్యూవో భాగ్యవతి, సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ మూర్తి, డీఆర్పీ జనార్దన్ హాస్టల్‌కు వచ్చి వివరాలు సేకరించారు. వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నడని చెప్పడంతో కలెక్టర్‌కు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థి సంఘాల ధర్నా

విద్యార్థులపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు హాస్టల్ ఎదుట ఆందోళన చేపట్టి అధికారి పురుషోత్తం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కారకులైన వార్డెన్, వాచ్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి, ప్రభంజనం, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఇద్దరు వృద్ధులు మృతి

కాసిపేట: సోమగూడెం బెల్లంపల్లి రైల్వే ట్రాక్‌పై శనివారం ఉదయం ఆఫ్‌లైన్ పట్టాలపై రామగిరి రైలు కిందపడి వృద్ధుడు, మధ్యాహ్నం 12 గంటలకు పాత బెల్లంపల్లి అండర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని రైలు తగిలి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. ట్రాక్‌పై ఉదయం మృతదేహాన్ని గుర్తించి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టగా కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామ పంచాయతీ సోమగూడెం పాతబస్తీకి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు మహ్మద్ రాజ్ మహ్మద్ (82)గా కుటుంబ సభ్యులు గుర్తించి మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. అండర్ బ్రిడ్జి సమీపంలో మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఆరెంజ్, బ్లాక్ కలర్ ఫుల్ టీషర్టు, బ్లాక్ జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని బెల్లంపల్లి మార్చురీలో ఉంచామన్నారు. తెలిసినవారు 8712658601, 9490871784 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ చౌరస్తాలోగల 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందాడు. మెండోరా ఎస్సై జాదవ్ సుహాసిని తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా సోన్ మండలం గాంధీనగర్‌కు చెందిన సాస్కిన్ అభినాష్(25) శుక్రవారం మధ్యాహ్నం తన బంధువుల పిల్లలైన రుసునకంటే గణేశ్, ఆంబ్లే లోకేష్‌తో కలిసి బైక్‌పై శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో రాత్రి ఇంటికి వస్తుండగా పోచంపాడ్ చౌరస్తాలోగల హైవేపై బైక్‌ను ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఘటనలో బైక్‌పై మధ్యలో కుర్చున్న అభినాష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు కాగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూలకోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు..

మంచిర్యాలక్రైం: వినాయకుని నిమజ్జనం సందర్భంగా తామరపూలకోసం వెళ్లి చెరువులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు అండాలమ్మకాలనీకి చెందిన మంచర్ల తిరుపతి (50) ఈ నెల5న సాయంత్రం తామరపూల కోసం చెరువుకువెళ్లి ప్రమాదవశాత్తు అందులోపడి మృతిచెందాడు. శనివారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల గాలిస్తుండగా ఏసీసీ చెరువులో శవమై కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటకుతీసి ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య రజిత, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ ప్రమోద్‌రావ్ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

మందమర్రిరూరల్: అనారోగ్యంతో బాధపడుతూ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతానికి చెందిన గందం వేణు (32) తల్లిదండ్రులు నాలుగేళ్ల క్రితం మృతి చెందడంతో సోదరుల వద్ద ఉంటున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం చేశాక తన రూంలోకి వెళ్లి పడుకున్నాడు. శనివారం ఉదయం ఎంతసేపటికీ లేవకపోవడంతో కిటికీలోంచి చూడగా ఫ్యానుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతుని సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుతదాడిలో లేగదూడ మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లక్సెట్టిపేట అటవీ రేంజ్ పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలో గల ముల్కల్ల అటవీప్రాంతంలోకి శుక్రవారం మేతకు వెళ్లిన గఢ్‌పూర్ గ్రామానికి చెందిన చిప్పకుర్తి ప్రసాద్ లేగదూడ లేగదూడపై చిరుతపులి దాడిచేసి హతమార్చినట్లు లక్సెట్టిపేట అటవీ క్షేత్రాధికారి కే.అనిత తెలిపారు. శనివారం సంఘటన స్థలాన్ని సందర్శించి అటవీప్రాంతంలో అమర్చిన కెమెరాలతో పాటు ఘటన స్థలంలో చిరుతపులి అడుగులు గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఎఫ్‌బీవో రాజేందర్, ఎనిమల్ ట్రాకర్ కలీం, రాజు ఉన్నారు.